

# ఈ బాధ పగవాడికి కూడా వద్దు!

జంబులింగం చాల తెలివైనవాడు మాత్రమే కాదు, చురుకైన వాడు కూడ.

అతను ఇరాక్ వచ్చి ఆరు నెలలు కాలేదు, అప్పుడే చాలా మంది చేత చాలా సామాన్లు ఇంటికి పంపించి వేశాడు! అతని నోరు పంచదార కంటె తీయన! మాట అన్నాడంటే సాధారణంగా ఎవరూ కొట్టివేయలేరు. ఎవరిని ఎలా తన పనికి అనుకూలంగా తెచ్చుకోవాలో అతనికి బాగా తెలుసు!

వచ్చింది లగాయతు అతను కావలసిన వారందరితోనూ స్నేహలతను దట్టంగా అల్లేశాడు. వీలైనంత మంది వద్ద దీనార్లు విపరీతంగా అప్పు చేశాడు! కొందరి వద్ద చేబదులు తీసుకొన్నాడు. తనకు దొరికే దీనార్లు గూడ చాలా జాగ్రత్తగా ఖర్చు పెట్టి, కొంత మిగుల్చుకొని. చీరలు– రిస్టువాచీలు– రకరకాల ఎలక్ట్రానిక్స్– సూటు బట్టలు– కస్మటిక్స్– బొమ్మలు– ఓహ్! ఒకటేమిటి చాలాచాలా కొన్నాడు.

ఇవి అన్నీ తను సెలవులో వెళ్ళేటప్పుడు తీసుకు వెళ్లాలి. సెలవులో వెళ్ళేటప్పుడు ఫ్లయిట్ టికెట్ మీద ఇరవై కేజీలే తీసుకు వెళ్ళనిస్తారు. అదీగాక– సెలవు ఇంకా చాలా దూరం ఉంది. ఈలోగా చాలా మట్టుకు ముందుగానే పంపించేయాలని నిశ్చయించు కొన్నాడు. ఇలా అందరి చేతా తలా ఒకటి రెండు వస్తువులు పంపించి వేస్తే– తను వెళ్ళేటప్పుడు మిగిలినవి 'ఈజీ'గా తీసుకు పోవచ్చు!– అని మాస్టర్ ప్లాన్ వేశాడు.

అంతే! తన వూరి నుండి ఎంతమంది సెకెండ్‌మెంట్ మీద ఇరాక్ వచ్చారో ఒక లిస్ట్ తయారు చేసికొన్నాడు. వారిలో ఎవరెవరు ఏ తారీఖు ఫ్లయిట్‌లో స్వదేశం సెలవులో వెళతారో–

అచ్చి రఘురామరెడ్డి

ఎప్పటికప్పుడు వెల్ఫేర్ ఆఫీసర్ వద్ద ఉండే లిస్ట్ చూసి- వాళ్ళు ఎక్కడ పని చేస్తున్నదీ తెల్సికొని వారికిగాలం వేసేవాడు.

అసలు జంబులింగం సరియైన కీలకస్థానం "రమాడీ"లో ఉన్నాడు. చాలా మంది ఎప్పటి కప్పుడు అక్కడికి రావలసినవారే! అందువల్ల అతని పని చాలా తేలిక అవసాగింది.

జంబులింగం తన సామాన్లు వాళ్ళచేత వీళ్ళచేత తన వాళ్ళకి ఎప్పటికప్పుడు ఇండియాకు పంపించివేయడం చూసి- అది చేతకాని వాళ్ళు ఏడ్చేవారు! అయితే జంబులింగం అటువంటి అసమర్థుల్ని చూసి "కేర్" చేయకపోగా, జాలిపడేవాడు!

ఆ రోజు మెస్‌లో లంచ్ తీసికోడానికి వెళ్ళాడు జంబులింగం. ఎదురుగా ఒక అపరిచిత వ్యక్తి భోజనం చేస్తున్నాడు. చూడగా అతను కాజీపేట్ వాడేనని పించాడు. ఎందుకైనా మంచిదని వల సిద్ధం చేశాడు.

"బ్రదర్, మీరు కాజీపేట్ నుండి వచ్చారు కదూ?"

భోజనం చేస్తూ ఉండడం వలన అతను ఔనన్నట్లు తల ఊచాడు.

"మా ఊరే అన్నమాట! ఏ డిపార్ట్‌మెంట్?'

తను ఏ డిపార్ట్మెంటో చెప్పాడు అతను- శంభులింగం!

"ఎక్కడ పని చేస్తున్నారు?"

మళ్ళీ జవాబు చెప్పాడు అతను.

"తీవులో ఎప్పుడు వెళుతున్నారు?"

"డిసెంబరులో "

"అంటే వచ్చే నెలే అన్నమాట!"జంబులింగం మనసు ఆదో రకమైన ఆనందంతో ఓలలాడింది చేప దొరికినందుకు.

జంబులింగం అతన్ని చాలాసేపటి వరకూ వదల్లేదు. చాలా వివరాలు సంపాదించాడు. అంతే! వల వేశాడు.

మరుసటి రోజు ప్లాను ప్రకారం జంబులింగం కోస్టరు టైముకి మెస్ ఎదురుగా నిల్చున్నాడు. ఈలోగా శంభులింగం అక్కడికి రానే వచ్చాడు, బజారు వెళ్ళడానికి.

రాగానే శంభులింగం కౌగలించుకున్నంత పని చేశాడు. మాటల్తో మంత్రించాడు.

కోస్టరులో ఇద్దరూ ప్రక్కపక్కనే కూర్చున్నారు. ఎప్పటివో పాత కాజీపేట్ ఊసుల్లోకి దిగిపోయారు.

బజారులో జంబులింగం, శంభులింగాన్ని వదల్లేదు. తనకున్న యుక్తి శక్తులతో వస్తువుల్ని బేరమాడి అతనికి కొనిపెట్టాడు.

బట్టల షాపులో శంభుకి చీరలు కొనిపెడు తున్నప్పుడు మంచి సమయం చూసుకొని- చాలా దీనాతి దీనంగా ఒక అస్త్రాన్ని వదిలాడు! "శంభుగారూ! మీరు ఏమీ అనుకోనూ అంటే, ఆహఁ! మీరు 'ఊఁ' అంటేనే సుమా... ఒక చిన్న రిక్వెస్ట్...."

శంభులింగం నోటి నుంచీ ఇంకా జవాబు రాలేదు-


"అదేనండీ!.... మా ఆడ మనిషికి ఒక చీర కొంటాను!... మీరు తీసుకు వెళతానంటేనే సుమా!...." అని నసిగాడు వినయంగా చేతులు నలుపుకొంటూ జంబులింగం.

"దానికేముందండీ! తీసుకు వెళతాను- మీరు అంతగా ప్రాధేయపడాలా?" అన్నాడు మొహమాటంగా శంభులింగం.

అంతే! జంబులింగం "టక్"మని ఒక చీర కొనేశాడు.

తర్వాత ఇద్దరూ మరో బట్టల షాపులోనికి దారి తీశారు. అక్కడ శంభులింగం తన పిల్లలకని యూనిఫారం క్లాత్ తీయిస్తున్నాడు.

"అన్నట్టు, శంభులింగం గారూ! మీరు కొంటుంటే నాకు గుర్తొచ్చింది- మా బాబిగాడు, చిన్ని కూడ యూనిఫారం క్లాత్ కావాలని రాశారు, సార్! మీరు అనుమతి ఇస్తే నేనూ కొనుక్కొంటాను!.... అదీ




మీరు తీసుకు వెళతాను అంటేనే!" అన్నాడు క్రీగంట శంభులింగం ఎలా స్పందిస్తున్నదీ గమనిస్తూ.

శంభులింగం లోన చిరాకుపడ్డా- అతని వినయానికీ, తనకు కొనడంలో బేరం అదీ చేస్తున్నందుకూ కృతజ్ఞతగా ఏమీ అనలేక పోయాడు.

"దానికేముంది, యూనిఫారమే కదా! కొనుక్కోండి" అని చిన్నగా మూలిగాడు.

ఆ మాత్రం అభయహస్తం చాలు- "టకేల్"మని అరు మీటర్ల యూనీఫారం క్లాత్ కొనేశాడు జంబులింగం.

"జంబూగారూ! ఇక్కడ మంచి క్వాలిటీ బాదంపప్పు అదీ ఎక్కడ దొరుకుతుంది?" అని సడన్‌గా అడిగాడు శంభులింగం.

అంతే! ఎలాగైనా ఒక కేజీ బాదంపప్పు అతని చేత పంపించాలన్న సంకల్పం మనసులో ఫ్లాష్ అయింది జంబులింగానికి.

"రండి, నాకు తెలిసిన ఓ రఫిక్ వున్నాడు! ఫస్ట్ క్వాలిటీపప్పు తక్కువ ధరకి ఇస్తాడు!" అని చెప్పి దారి తీశాడు.

"శంభూగారూ! మా పిల్లలకి గూడా ఈ పప్పంటే ఎంతో యిష్టం సార్! తినడానికి ఏమీ పంపకపోతే పిల్లలు ముఖం చిన్నబుచ్చు కొంటారు! ప్లీజ్! ఇదేనా ఆఖరి రిక్వెస్ట్... మీరు ఎస్ అంటే నేనొక కేజీ కొనుక్కొంటాను!"

శంభులింగానికి ఈ సారి నిజంగా ఒళ్ళు మండింది.

'ఏమిటి ఇతని ఆంతర్యం? ఇప్పటికే ఒక చీర, యూనీఫారం క్లాత్ అంటగట్టాడు. ఇంకా ఇది కూడానా?- ఏరోప్లేన్ మా బాబుది అనుకున్నాడా?' అని లోలోన చిరాకు పడ్డా - పిల్లలకోసం అని జంబులింగం పెట్టిన దీనాతి దీనమైన ముఖార విందాన్ని చూసి, "నో" అనలేక - మౌనంగా ఊరుకొన్నాడు.

అంతే! మౌనం అంగీకారంగా తీసికొని ఆలస్యం చేయకుండా ఒక కేజీ బాదం పప్పు కొనేశాడు.

అలా - శంభులింగం చేతిలో నాల్గు కేజీల బరువైన ప్యాక్‌పెట్టాడు జంబులింగం!

ఇది కేవలం ఒక 'ఎక్జాంపుల్' మాత్రమే!

ఇలా చాలా చేపల్ని రకరకాల యుక్తులతో, వలలో వేసికొని చాలా సామాన్లు పంపించాడు జంబులింగం ది గ్రేట్!

★ ★ ★ ★ ★ ★

రైట్స్ కంపెనీకి వచ్చిన పెద్ద కంట్రాక్టుల్లో - ఇరాక్ లోని బార్ ప్రాజెక్ట్ ఒకటి. 540 కి. మీ. నిడివి గల ఈ నూతన రైల్వే లైను అనేక ఇండస్ట్రియల్ పాయింట్స్‌ను కలుపుతూ - బాగ్దాద్‌తో మొదలై అకాషత్‌తో అంత మౌతుంది. మధ్యలో రమాడీ

-హత్- అల్ ఖయ్యాం మొదలైన స్టేషన్లు ఉన్నాయి.

ఈ ప్రాజెక్ట్ 1988 మే నెల 31వ తారీఖున మొదలై, ఐదు సంవత్సరాల కాంట్రాక్ట్ మీద నడుస్తోంది. ఈ ప్రాజెక్ట్‌లో సుమారు 1600 మంది భారతీయులు సెకెండ్ మెంట్ మీద ఉద్యోగాలు చేస్తున్నారు.

ప్రతి ఒక మెంబరు ప్రస్తుతానికి రెండు సంవత్సరాల కంట్రాక్టు మీద పని చేయడానికి వచ్చారు. సంవత్సరానికి ఒక నెల రోజుల సెలవు మీద ఇండియాలో ఉన్న తమ కుటుంబాల్ని చూసి రావడానికి పంపుతారు. ఐతే, అందరూ ఒకేసారి సెలవులో వెళితే ఇక్కడ ప్రాజెక్టు కుంటు పడకుండా- ఆరు నెలలు గడచినది మొదలు - ఒక్కొక్కరినీ వారు కోరిన నెలల్లో సెలవు మీద పంపడం మొదలెట్టారు. వెళ్ళేటప్పుడు ఫ్లయిట్ మీద ఇరవై కేజీల లగేజి మాత్రం తెసుకు వెళ్లవచ్చు.

రమాడీలో ఆర్. ఎమ్. ఆఫీసువుంది. అందులో మన హీరో జంబులింగం ఆఫీసు అసిస్టెంట్‌గా వుద్యోగం వెలగ బెడుతున్నాడు.

* * * * * * *

జంబులింగం సెలవులో వెళ్లడానికి ఇక ఒక నెల వ్యవధి మాత్రం ఉంది.

అప్పుడే ఒక గోల్డ్ రింగ్ కొనేశాడు! డ్యూటీ ఫ్రీ షాపులో ఒక టూ- ఇన్- వన్ ఎప్పుడో కొని రెడీగా వుంచుకొన్నాడు.

అందమైన స్వీడన్ రగ్గు కూడ కొన్నాడు. ఇంకా ఎన్నో చీరలు, కెమేరా, సెంట్లూ - జ్ఞాపకం రావడం లేదుగాని! - చాలా అయిటమ్స్ కొని రెడీగా ఉంచుకొన్నాడు.

ఇప్పుడు అతను తీసుకు వెళ్లవలసిన

## ఈ బాధ పగవాడికి కూడా వద్దు!

వస్తువులు సుమారు నలభై కేజీల దగ్గరుంది!- అయితే తీసుకు వెళ్ళనిచ్చేది ఇరవై కేజీలు మాత్రమే! అఫ్‌కోర్స్, మనసు బాగుంటే ఐదారు కేజీలు ఎక్కువ 'ఎలవ్' చేస్తుంటా రనుకోండి!

అయితే - ఇంతకీ చెప్పొచ్చేది ఏమంటే జంబులింగం తను ఏ తారీఖున ఇండియా సెలవులో వెళుతున్నదీ ఎవ్వరికీ తెలియకుండా చాలా జాగ్రత్త పడసాగాడు!- తెలివైన వాడు కదా, మరి!

ఇప్పటికే తన వద్ద నలభై కేజీల లోడు ఉంది. తను వెళ్తున్నట్టు తెలిస్తే ఎవరేమేమి ఇచ్చేస్తారో తమ ఇళ్లకు యివ్వమని అని గుబులు చెందడం మొదలెట్టాడు!- అందుకే తన లీవ్ ప్రోగ్రాం, లీక్ కాకుండా చాలా సీక్రెట్‌గా ఉంచాడు!

అయితే పిల్ల పుడితే పేరు దాగుతుందా?- అన్నట్టు ఈ సంగతి చాలా మంది. అప్పుడే కనిపెట్టేశారు! "తాడిని తన్నువాడు ఒకడైతే....." అన్నట్టు - ఒకరిని మించిన వారు ఇంకొకరు కదా!

* * * * *

కాలింగ్ బెల్ మ్రోగింది!

చికాకుగా బెడ్‌పై నుంచి లేచి తలుపు తీశాడు జంబులింగం.

ఎదురుగా పళ్లు ఇకిలిస్తూ కన్పించాడు శంభులింగం! అంతే! జంబులింగం గుండె గుభేల్ మంది!

"కొంపతిసి వీడు నా సెలవు సంగతి కనిపెట్టలేదు కదా! సామాన్లు నాకు అందించడు కదా ఇంటికి ఇవ్వమని!" అని ఒక్క క్షణం మనసుతో మాట్లాడి- పైకి ఏడుపులాంటి చిరునవ్వు నవ్వి అతన్ని అయిష్టంగానే లోనికి ఆహ్వానించాడు.

అన్నంతపనీ అయింది!

కొంతసేపు మాటలూ అవీ అయ్యాక శంభులింగం, "బ్రదర్! మీరు లీవులో వెళుతున్నట్టు లిస్ట్‌లో చూసి వచ్చాను! ఏంలేదూ! మా వాళ్ళకి ఈ ప్యాకెట్ పంపిద్దామని!!" అంటూ ఒక ప్యాకెట్ జంబులింగం చేతిలో పెట్టాడు. అది సుమారు నాలుగున్నర కేజీలు ఉంది!

తాను పంపిన దానికి వడ్డీతో ఋణం తీర్చడానికి అల్‌ఖయ్యాం నుండి వచ్చాడన్న మాట- అనుకొని, పైకి కళలేని నవ్వులాంటిది ముఖాన పులుముకొన్నాడు.

కొంతసేపు కూర్చొని, ఏదో పనుందని మెల్లిగా జారుకున్నాడు శంభులింగం.

జంబులింగానికి వచ్చిన బోణీ కేసు ఇది!

* * * * *

జంబులింగం లీవులో వెళ్లడానికి ఇంక వారం రోజులు మాత్రమే ఉంది!

"భగవంతుడా! ఈ వారం రోజులూ ఎవరూ నాకు ప్యాకెట్లు ఇవ్వకుండా చూడు!" అని రోజూ-దైవ ప్రార్థన చేయసాగాడు. ఎవరికీ కనబడకుండా తప్పించుకు తిరిగే వాడు. రూమ్‌కి వచ్చిన తర్వాత బయటికి కదిలేవాడు కాదు.

అతనికి ఎవరు ఎప్పుడు వచ్చి కాలింగ్ బెల్ నొక్కుతారో అని మహా బెంగగా ఉంది.

అయితే, జంబులింగం ఒక్కడే తెలివైన వాడు కాదు!

జంబులింగం ఎంత మందిచేత తన వస్తువులు ఇంటికి పంపాడో అంతమందీ- రోజు రోజుకీ వచ్చి, తలుపు గుద్ది మరీ అతని చేతిలో తమ ప్యాకెట్లు పెట్టి వెళ్లారు!

ఇప్పుడు కాలింగ్ బెల్ మ్రోగితే అతనిక మృత్యుభేరిలా అనిపించసాగింది.

అప్పుడే నలభై కేజీల సరుకు వేర్వేరు సోదరుల నుండి వచ్చి చేరింది.

విచిత్రం! తాను సామాన్లు యివ్వని వాళ్లు కూడ కొంతమంది తలుపులు బాదసాగారు! వచ్చిన వాళ్లు వి. ఐ. పి.లు! కాదనడానికి వీల్లేని వాళ్లు! చిరునవ్వుతో వాళ్ల సామాన్లు కూడ అందుకొన్నాడు పాపం! జంబులింగం!

ఇప్పుడు అతని వద్ద నలభై ఐదు కేజీల సామాను అధికంగా చేరింది!

మొత్తం బరువు ఎనభైఐదు కేజీలు అన్నమాట! బాప్‌రే!

దెబ్బతో జంబులింగం జ్వరం పెట్టుకున్నంత పని చేశాడు వెళ్లేముందు! తన పెళ్లాం, పిల్లల్ని చూసి రావాలన్న ఆనందం, కోరిక అతని ముఖంలో ఏకోశానా లేదు!


అందుకే అంటారు- తనదాకా వస్తే కాని బోధపడదని!

ఇప్పుడు అతనికి ఒకటే బెంగ!-

ఇంత సామాను ఇండియా ఎలా చేరవేయడం?!-

ఎలా?- ఎలా??- ఎలా???

పాపం! ఇతరుల సామాన్లు పెట్టడానికి జంబులింగం పెట్టెలోగాని, బ్యాగుల్లో గాని బిల్‌కుల్



చేటు లేదు!

కనీసం ఇరవై ఐదు దీనార్లు పెట్టి ఒక పెట్టె, ఒక పెద్ద ఎయిర్‌బ్యాగ్ కొనే వలసి ఉంది!?-

'ఛీ! వెధవలకు బుద్ధిలేదు! ఇంత సామాను ఎలా తీసుకు వెళతానని నా ముఖాన కొట్టి వెళ్ళిపోయారు?! ఏరోప్లేన్ మా తాతదా? మా మామదా?' అని స్వగతంగా, ఉద్వేగంగా బయటికే తిట్టేశాడు.

పాపం! జంబులింగం తాను పంపినప్పుడు తనలాగే వాళ్ళెంత బాధపడి ఉంటారో అని అనుకోవడంలేదు!

రోజులు దగ్గర పడుతున్న కొద్దీ- దేశం వెళతానన్న సంతోషం పోయి, ఉరిశిక్ష దగ్గర పడినంత నిర్వేదం చెందసాగాడు.

తిండి సహించడంలేదు. నిద్ర పట్టడంలేదు. విపరీతమైన బెంగ- నిర్వేదం- ఆందోళన. ఒహ్! ఒకటే టెన్షన్! టెన్షన్!!

ఎనభై ఐదు కేజీల సరుకు ఎలా తీసుకు వెళ్ళగలడు తను?

తీసుకు వెళ్ళను అంటే వాళ్ళు ఊరుకోరు కదా! తన సామాన్లు తీసుకు వెళ్ళి ఉన్నారు కదా!- తను ఎలా కాదనగలడు?- కాదంటే ఇంకేమన్నా వుందా?తన్నరూ?!

ఇప్పుడు జ్ఞానోదయమయింది మన బుద్ధుడికి!!!

'భగవంతుడా! వాళ్ళిలా తీసుకు వెళ్లారో కదా?!' అని అసంకల్పితంగా అప్పుడు తలచాడు. కళ్ళమ్మట నీళ్ళు కూడా వచ్చాయి.

ఒక కేజీకి రెండు దీనార్లు చొప్పున ఎక్స్‌ట్రా కట్టాలి ఎక్స్‌ట్రా లగ్గేజీకి. అంత డబ్బు తన వద్ద ఏది? అంతా ముందే వస్తువులు కొనేశాడు! ఇప్పటికే బోల్డు అప్పులు తెలిసిన వాళ్ళందరి దగ్గరా చేసి ఉన్నాడు. ఇప్పుడు అప్పు అడగడానికి ఎవరూ మిగల్లేదు!

'ఛీ! బుద్ధొచ్చింది! ఎప్పుడూ ఒకరికి మన వస్తువులు ఇవ్వరాదు! ఒకరివి తీసుకుపోరాదు!'- ఈ ధర్మసూక్ష్మం తెలుసుకునేసరికి చాలా ఆలస్యమైపోయింది.

హే హతవిధీ! ఇప్పుడిక తప్పదు!

హే భగవాన్! నీదే భారం!

ఈ సామాను ఎలా ఇండియా చేర్చుతావో! వెంకటరమణా! ఈ గండం గడిస్తే నా తలనీలాలు నీకు ఇచ్చుకుంటా!- అని ఎక్కడో ఏడుకొండల మీద ఉన్న దేవుడికి మళ్ళీ మళ్ళీ మ్రొక్కాడు.

అతని మొర భగవంతుడు విన్నాడా?- ఎలా వినగలడూ?- అంటున్నారా?- ఏమో! కొద్దిగానైనా సహాయపడడా భక్తుడికి?-

* * * * *

జంబులింగం సెలవులో వెళ్ళడానికి ఇక ఒక్క రోజు మాత్రమే ఉంది!

జంబులింగం బెంగతో జబ్బుమనిషిలా, జీవచ్ఛవంలా, భగ్న ప్రేమికుడిలా, నిరాశావాదిలా- బొత్తిగా డీలా పడిపోయాడు. రేపే ఉరిశిక్ష అన్నంత నిర్వేదంలో ఉన్నాడు! అతని బాధ వర్ణనాతీతం!

## మహిళా పైలెట్ ప్రపంచ రికార్డు



పురుషుల కంటే మేమేం తీసిపోలేదు అని ప్రతి రంగంలోను స్త్రీలు ముందంజ వేస్తున్న విషయం తెలిసినదే! విమానాలు నడిపే విషయానికి వస్తే యిటీవలి కాలంలో మహిళా మణులు కూడా పైలెట్‌లుగా ఎన్నికవుతున్నారు. ఒకే రోజున ఎక్కువసార్లు విమానాలను నడిపిన ఘనత పౌలాస్క్రిమ్‌షా అనే మహిళా పైలెట్‌కు దక్కుతుందట. ఆమె జెర్సీ- గర్నెసీల మధ్య ఒకే రోజున 24 విమానాలను నడిపి ప్రపంచ రికార్డు సృష్టించింది. కేవలం 12 గంటల్లోనే ఈ రికార్డు నెలకొల్పబడిందట.

ఇంతలో కాలింగ్‌బెల్ అణుబాంబులా గర్జించింది!

త్రుళ్ళిపడ్డాడు అంతెత్తుకు జంబులింగం!

'అమ్మ బాబోయ్! మళ్ళీ ఎవడికి పోయే కాలం వచ్చింది! ఇంకా నన్ను చంపడానికి ఎవడొచ్చాడు?!'

జంబులింగం గజగజ ఒణకసాగాడు.

ఎవరో మళ్ళీ తనకు ప్యాకెట్లు ఇవ్వడానికి వచ్చారని అనుకొంటున్నాడు జంబులింగం. ఒకటే భయం!

తలుపు తియ్యాలా. వద్దా- అన్న మీమాంసలో పడిపోయాడు.

మళ్ళీ మ్రోగింది కాలింగ్‌బెల్!

'ఇక లాభం లేదు!'- మెల్లిగా జబ్బుమనిషిలా నీరసంగా లేచి అయిష్టంగానే తలుపు తెరిచాడు!

ఎదురుగా రామలింగం!- తన ఊరివాడే!! అల్‌ఖయ్యాం నుంచి వచ్చాడు!!!

"హల్లో! రండి!" అన్నాడు జంబులింగం- గాని మనసులో... 'ఇప్పుడు ఇతనొచ్చాడేమిటి? కొంపతీసి, ప్యాకెట్‌లాంటిది ఏదైనా తెచ్చాడా?ఏమిటి?-తలచుకుంటే ఒళ్ళంతా పాములూ తేళ్ళూ ప్రాకినట్టనిపించింది.

జంబులింగం ముఖాన 'ప్రేత 'కళ' లాంటిది తాండవమాడుతోంది!

అది ఇట్టే కనిపెట్టాడు రామలింగం!

"వాట్, బ్రదర్! అంత నీరసంగా ఉన్నావ్? ఇండియాకి వెళుతున్నావా? లేదా?"

'అమ్మ బాబోయ్! వీడు తప్పక ప్యాకెట్ ఇవ్వడానికే వచ్చాడులా ఉంది!' అని నిలువునా ఒణికిపోయినంత పని చేశాడు.

"వీల్లేదు! నేనేం తీసుకు వెళ్ళలేను! ఇప్పటికే ఎనభై ఐదు కేజీలు అయింది! అయామ్ ఎక్స్‌ట్రీమ్లీ సారీ!!" అని బయటికే ఉద్వేగంగా అనేశాడు అప్రయత్నంగా.

పాపం! దెబ్బతో రామలింగం గాభరాపడి పోయాడు.

'కొంపతీసి ఇతనికి పిచ్చిలాంటిది పట్టలేదు కదా!'

రామలింగం ఏమీ అనక ముందే అలా నోరు జారినందుకు రవ్వంత సిగ్గుపడి. "సారీ, బ్రదర్! మనసు బాగులేక ఏదో వాగాను! ఏమిటి సంగతి ఇలా వచ్చావ్?" అన్నాడు మంద్ర స్వరంతో జంబులింగం జీవచ్ఛవంలా, మర్యాద కోసం. అతని గుండె నూటా నలభైనాలుగుసార్లు కొట్టుకొంటోంది ఒక నిమిషానికి!

వచ్చిన సంగతి చెప్పాడు రామ[illegible]!

అంతే! జంబులింగం ఉక్కిరిబిక్కిరి అయిపోయాడు- ఎందుకంటే అతను తెచ్చింది ఓ చిన్న ఎయిర్ బ్యాగ్ మాత్రమే!!!-

జంబులింగం తేరుకోడానికి ఓ నిమిషం పట్టింది.

"అయితే బ్రదర్! నువ్వు మళ్ళీ లీవులో వెళుతున్నావా? ఈ ఫ్లయిట్‌లోనే!?" ఆ స్వరంలో ఎక్కడ లేని ఉద్వేగం, ఆనందం.

"ఔను, జంబూ! మా మదర్ సీరియస్ అని టెలెక్స్ వచ్చింది! అందుకని అప్పటికప్పుడు బయలుదేరాను. ఇప్పుడే ఆర్. ఎమ్. ఆఫీసులో ఫార్మాలిటీస్ అన్నీ ముగించుకొని. నీవూ వెళుతున్నావు కదా అని- ఇద్దరం కలిసి బాగ్గాడ్ పోవచ్చునని వచ్చాను!"

"సారీ, బ్రదర్! మీ మదర్‌కి బాగులేదనగానే నాకు చాలా బాధగా ఉంది! అయామ్ వెరి సారీ!" అని దుఃఖాన్ని వెలిబుచ్చాడు చాలా అభిమానంగా. ఆ స్వరంలో ఎక్కడ లేని ఆర్ద్రత!

ఇప్పుడు రామలింగం తనను కాపాడడానికి వచ్చిన ఏడుకొండలవాడిలా అగుపించాడు!

కొంతసేపు మాట్లాడుకొన్న తర్వాత, జంబులింగం

తన ప్రోబ్లమ్ చెప్పి- ఇరవై కేజీలు అతనికి అంటగట్టాడు నెమ్మదిగా!.

ఇకపోతే- ఇంకా సుమారు దగ్గర దగ్గర నలభై కేజీల సరుకు మిగిలింది!

ఎలా? ఎలా?? ఎలా???

గ్రేట్ ప్రోబ్లమ్ ఏ దారి కనబడటం లేదు జంబులింగానికి.

అయితే- కాలం మరి ఎవరి కోసం ఆగదు, మరి!

జంబులింగం విపరీతంగా బెంగపడితే మాత్రం ఆగుతుందా?....

ఆ రోజు రానే వచ్చింది! భయంకరమైన రోజు జంబులింగం పాలిట!

ఎరోడ్రంలో జంబులింగం పాట్లు చూడాలేకాని, రాయనలవి కానటువంటివి!

లగ్గేజీ కౌంటర్‌లో జంబులింగం ప్రతి ఒక్కరి గడ్డం పట్టుకు మరీ బ్రతిమాలాడు, కొంత తీసుకోమని.

పాపం! అందరి లగ్గేజీ ఆ రోజు నిండు గర్భిణీలా పుష్కలంగా ఉంది! ఎవరి వద్దా పాతికకు మించి తక్కువలేదు!- అందరికీ అదే బాధ కదా మరి! వాళ్ళకీ- వాళ్ళూ వీళ్ళూ, అందరూ ఇచ్చే ఉంటారు దండిగా తమ ఇళ్ళలో యివ్వమని!

ఎవరి బాధ వారిదే కాని, ఇంకొకరి బాధ అఖ్ఖర్లేదుగా మరి!

పూర్ ఫెల్లో జంబులింగం! జుత్తు పీక్కున్నాడు- తెంపలేసుకున్నాడు- నేలను కాలితో గట్టిగా

## ఈ బాధ పగవాడికి కూడా వద్దు!

తన్నాడు! (కాలు నొప్పి పెట్టిందని గాని అది గమనించే పరిస్థితిలో లేడు తను).

సామాన్లు ఇచ్చిన వాళ్ళను నానా దుర్భాషలాడాడు మ్లేచ్ఛ భాషలో!- ఏం లాభం?- ఎవరు చేసిన ఖర్మ వాళ్ళే అనుభవించాలి మరి!

ఈలోగా లగ్గేజీ కౌంటర్ వద్ద తన వంతు రానేవచ్చింది. తూకంలో అరవై ఐదు కేజీలు చూపించింది!

కౌంటర్‌లో ఇరాకీ ఆడకూతురు ముఖం చిట్లించింది, ముఖం 'ఎమ్' ఆకారం వచ్చేటట్లు!

పై ప్రాణాలు పైనే పోయాయి జంబులింగానికి. వెంటనే పాశుపతాస్త్రం వదిలాడు!

తొలిసారిగా జీవితంలో ఓ ఆడమనిషికి రెండు చేతులూ ఎత్తి దీనాతిదీనంగా దండం పెట్టాడు- ఏదో చూసి చూడనట్లు విడిచి పెట్టెయ్యమని!

అదే ఇంకో దేశంలో అయితే ఎలా ఉండేదో గాని....

ఆమె తాటకిలా నవ్వింది! ఆ నవ్వు భయంకరంగా అగుపించింది!

"వై, సోమచ్ లగేజ్?... పే సెవెంటీ ఫైవ్ దీనార్ ఎట్ దట్ కౌంటర్!" అని పాస్‌పోర్టు తీసుకొని, చిన్న చీటీ రాసి చేతిలో పెట్టింది, కరుణ లేని కసాయినిలా. అతని అస్త్రం ఏమీ పనిచేయలేదు, పాపం!!!

డబ్బై ఐదు దీనార్లు అంటే ఇంటర్‌నేషనల్ మనీ వాల్యూలో మూడువేల ఏడు వందల ఏభై రూపాయలు!- గుండె బాదుకొన్నాడు జంబులింగం. ఎవరు వింటారు అతని ఆక్రందన? కొన్ని క్షణాలు గుండె ఆగినంత పని అయింది!

అప్పుడు పశ్చాత్తాపపడ్డాడు జంబులింగం అయ్యో! నేనే ఇంత బాధపడుతున్నాను కనుపించిన ప్రతి వారికీ సామాను అందించాను. నాలాగే వాళ్ళకు ఇంకెంతమంది అందించి వుంటారు! వాళ్ళెంత బాధపడ్డారో?! నాకీ ప్రాయశ్చిత్తం జరగవలసిందే! ఇదేం రైలుబండా?- ఎంతబడితే అంత మోయడానికి- అని తన్ను తాను ఛీదరించుకొన్నాడు తిట్టుకొన్నాడు- శపించుకొన్నాడు.

నోరు మెదపకుండా వెళ్ళి ఎక్స్‌ట్రా లగ్గేజీ కౌంటర్‌లో దీనార్లు చచ్చినట్టు కట్టాడు.

జంబులింగం ఇతరుల వస్తువులు తీసుకు వెళ్ళడానికి దగ్గర దగ్గర వంద దీనార్లు ఖర్చుపెట్టాడన్న మాట!!- ఇంకా దేవుడిలా రామలింగం ఇరవై కేజీలు 'హెల్ప్' చేయగా!

ఓ! గాడ్! ఈ బాధ పగవాడికి కూడ వద్దు!- అని భోరున ఏడ్వకపోయినా, ఏడ్చినంత పని చేశాడు జంబులింగం.

అన్నట్టు, చెప్పడం మరిచా! జంబులింగం తాను అపురూపంగా కొనుక్కొన్న గోల్డ్ రింగ్ వచ్చే ముందు తిరిగి నూట ఇరవై దీనార్లకు అమ్మేశాడు!

